



రావు వాచీవంక చూసుకున్నాడు. ఆరుగంటలు! ఇంకా చీకటిపడలేదు. ఇలా వంటరిగా గదిలో కూర్చోవాలంటే రావుకు మహా''బోర్''గా ఉంది. పాడుబడ్డ ఆలోచనలు ఈగల్లా ముసిరి మనసు దాటిపోవడంలేదు! రావు ఆలోచనలు గీతగీసినట్లు ఎపుడూ ఒక పరిధిలోనే గిరికీలు కొడుతున్నాయి! ఆ వృత్తంలో ఎక్కువ భాగాన్ని...ఎక్కువేమిటి...దాదాపు మొత్తాన్ని రావు భార్యే ఆక్రమించేస్తుంది.

రావుభార్య చాలామందికంటే లావుగా చాలామందిలా నల్లగా ఉంటుంది. అపుడపుడు రావు అందుకే నాకు వేరే ఆలోచనలు రాకుండా పోతున్నాయని తనను తాను తృప్తిపరుచుకుంటాడు। రావుభార్య ఈమధ్య నల్లబడి, బాగా లావెక్కలేదు। రావు పెండ్లినాటికే అలా గుమ్మటంలా ఉంది। ఇప్పటికీ వృద్ధిచెందున్నదేగానీ ఏమాత్రం తగ్గడంలేదు।।

రావుకు తలనొప్పి కూడా మొద

లయింది।

ఇన్ని ఆలోచనలు ఇంత చికాకులో రావుకు అపుడపుడు ఆనందం లభించేది 'జయ' గుర్తుకు వచ్చినపుడు గమ్మత్తేమిటంటే ఈ సంతోషం. దాని వెనకనే దాన్నిమించిన బాధ వెంటవెంటనే కలుగుతాయి।

తాను జయను పెళ్ళి చేసుకున్నట్లయితే ఈ బాధంతా ఉండకపోను। అమ్మో ఈ ఆలోచన కూడా అంతగా రుచించ లేదు. జయను చేసుకుంటే. మూడంత స్థల బంగళా రెండుకార్లు, నాలుగు ఫాక్టరీలు నల్లటి భార్య. మచ్చల బొచ్చు కుక్కలూ, లెక్కకుమించిన నౌకర్లూ తనకు దక్కేవాళ్లుకారు।

కాని తాను జయను మోసంచేశాడు. ఈ ఆలోచన రావుకు చాలా సరదాగా ఉంటుంది నిజంగా తాను జయను మోసం చేయాలని చేయలేదు। పరిస్థితు లలాంటివి మరి। జయవాళ్ళు బాగా బీదవాళ్ళు కావడం రోగిష్టి తల్లి, ఒంటిరెక్క సంపాదన ఎదుగుతున్న తమ్ముళ్ళు వీళ్ళందరూ కలిసి కట్టుగా జయను మోసంచేశారు తప్ప తానుకాదు కానేకాదు।।

పూర్ ఫెలో । ఇపుడు జయ కనిపిస్తే బావుండు ఓ అనాకారి మొగుడితో ప్రక్కన అయిదుగురు పిల్లల్తో దరిద్రంతో తనని చూసి కళ్ళు దించుకుంటుంది. తానయితే 'అలాంటపుడు కొంత ఎకనామికల్ హెల్ప్' చేయగలడు. ఇంకాజయ అప్పటిలా అందంగా ఉంటే చూపి పాతస్మృతులు... జయ ఒంటి వెచ్చదనం ఒంపులు గుర్తుకు తెచ్చుకుని గర్వపడతాడు. ఛీ ఛీ తన పిచ్చిగానీ, జయ ఇపుడు తాను గుర్తుపట్టే స్థితిలో కూడా ఉండదు

* * *

రావు 'జానీవాకర్' ఓపెన్ చేశాడు. సోడా కలుపుకుని తాగాడు దాదాపు సగం బాటిలు లాగేశాడు। చిప్స నమిలాడు. సిగరెట్లు కాల్చాడు అయినా ఆలోచనలు రావు మనసును వదలడంలేదు।

తలుపు తెరుచుకుని రూంబాయ్ వచ్చాడు।

'సార్ ఏమైనా కావాలా!'

ఆఁ ''ఏమైనా'' కావాలి

''సరే సార్ !'' రూంబాయ్ అర్ధమయినట్లు వెధవనవ్వు నవ్వి, తలుపుమూసి బయటకు వెళ్లిపోయాడు।

* * *

ఆలోచనలు, పాడు ఆలోచనలు ఆపుదామంటే ఆగవు। ఆలోచనల్తోపాటు భార్య గుర్తుకువస్తుంది। ''దట్ డర్టీబిచ్ హాంట్స్ ఆల్ వేజ్। ఛీ భార్య గుర్తుకువస్తే శరీరంలో రక్తం సగం ఇంకిపోతుంది దాని డబ్బు తప్ప తానేమీ అనుభవించలేదు। అనుభవించడానికి దానిదగ్గిర నల్లటిరంగు రబ్బరు బెలూనులాంటి ఒళ్లుతప్ప ఏమీ లేదు। దాని మాటలు మహా కర్కశంగా ఉంటాయి। తన మచ్చల బొచ్చుకుక్కలతో మాటాడినట్లు తనతో మాట్లాడుతుంది। తనకు కోపంవస్తుంది కానీ ఏమీ అనలేడు। అనడానికి తనకు భయం। దాన్ని చూసికాదు. దానికి దాని తండ్రి ఇచ్చిపోయిన బోలెడంత డబ్బును అనుభవించకుండా పోతానే అన్న ఆలోచనవల్ల

అబ్బ దర్టీథింకింగ్ ఒకటే ఆలోచ నలు ఈగలు ।

* * *

విస్కీసీసా పూర్తయింది. జీడిపప్పు పూర్తయింది. రావు తలంతా దిమ్మగా ఉంది నిదానంగా స్టడీగా సిగరెట్టు తాగుతూ కూర్చున్నాడు. అన్ని ఆలోచ నలూ కలిసిపోయి, సాలెగూడులా అల్లుకు పోయి, కలగా పులగం అయిపోవడంవల్ల బ్రతికిపోయాడు రావు। ఇపుడాలోచనలు లేకకాదు। ఆలోచించే ఓపిక తగ్గిపోయింది।

గది తలుపులు తెరుచుకుని 'బోయ్' లోపలికి వచ్చాడు. వాడివెంట సెంటు వాసనా, ఆమె కూడా లోపలికి వచ్చాయి।

''తలుపేసుకోండి సార్ నేను వెళ తున్నా।'' రూంబాయ్ బయటకు పోయాడు ఆమె నవ్వుతూ తలుపు మూసింది. రావు కళ్లు పైకెత్తి ఆమెను చూశాడు। తల విది లించాడు రెప్పలు తాటించాడు। ఆల్‌రైట్। ఆమె జయే।। సందేహంలేదు కరక్టు।।

రావులో లేని ఓపికా ఉత్సాహం ఆటో మేటిక్‌గా వచ్చేశాయి పరీక్షించి చూశాడు।

జయ అప్పటికన్నా ఇపుడింకా అం దంగా ఉంది. కొంచెం ఒళ్లుచేసింది. రంగు ఇంప్రూవయ్యింది. నవ్వు పెంచు కొంది కళ్లు ఖిలంగా, లేడికళ్లలా బెదిరి చూస్తున్నాయి। పచ్చని సిల్కుచీరె గులాబీరంగు స్లీవ్‌లెస్ బ్లౌజు వేసుకుంది. మెడలో పొడవైన తెల్లని ముత్యాలదండ, గులాబీ రేకుల్లాంటి పెదిమలు, పైకి మడిచిన కొప్పులో రెండు గులాబీలు।

''జయా ఎన్నాళ్లకు '' రావు లేచి తప్పటడుగు వేశాడు।

''నాపేరు జయకాదు లక్ష్మి।'' చేపపిల్ల నోరులాంటి ' నోరువిప్పి గవ్వలు కుప్ప పోసినట్లు గలగల నవ్వింది।

''నో నువ్వు జయవు. అబద్ధమాడకు నామీద నీకింకా కోపం పోలేదని అర్ధ మయింది. పూర్ జయా। '

ఆమె మౌనంగా వింటూ బెడ్‌మీద కాళ్ళు ముడుచుకుని కూర్చుంది।

'' నేను రోగ్‌ని। ఇడియట్‌ని కాని జయా. ఏమిటిది, ఇలా అయిపోయావేం? మన ప్రేమ ''డిస్ట్రిబ్'' అయినంత మాత్రాన ఏమిటిది ।''

''గడవక'' ఆమె నెమ్మదిగా అంది।

''నాన్సెన్స్ పెళ్ళయితే చేసుకోలేక పోయానుగానీ, ''హెల్ప్'' చేయనను కున్నావా? కమాన్. నువ్వెంత కావా లంటే అంత డబ్బుతీసుకో అసలెందు కిలా అయింది।'' రావు ఆమెను సమీ పించి వంగి ముద్దుపెట్టుకున్నాడు।

''మీ అమ్మ ఏమయింది?''

''చచ్చిపోయింది।''

''నాన్న।''

''నాన్నకూడా।'.

''ఊఁ''

''ఆ దినం మీరు అవునంటే నాగతి ఇలా ఉండేది కాదు।''

రావు నెవరో కొరడాతో కొట్టినట్ల యింది నిజమే। ఆ దినం తాను జయను చేసుకుంటే, తన స్థితికూడా ఇలా ఉండక పోయేది. నిజమే।

ఆమె వళ్లో తలపెట్టుకుని, పైకి కళ్ళ

మనసు స్వీటు—మనిషి సీటు
అందమైన యాక్షన్‌లో అతనిదొక
స్పెషల్ రూటు
పాత్రల సెలక్షన్-చిత్రాలలో రిచ్‌నెస్
అతను తీసుకునే మంచి నిర్ణయాలకు
విట్‌నెస్
పరిశ్రమకు ఫ్యూచర్ హోప్ శోభన్
అంటూ చెప్పాడు మరో మహానటుడు
ఇతన్నిగురించి తన ఇంప్రెషన్.



ల్లోకి చూస్తూ మాట్లాడుతున్నాడు రావు।

''నిజం జయా। ఆ రోజుల్లో డబ్బుకు ప్రపంచంలో సరితూగ గలదేవీ కనిపించ లేదు నిజం అందుకే నిన్నుకాదన్నాను నీలో పెరిగే నా రూపంకూడా నాకపుడు ప్రేమగా తోచలేదు''

జయ పెదవులమీద శుష్కమందహాసం ఒకటి మెరిసి మాయమయింది రావు అర్థం చేసుకున్నాడు। జయ రావు తలలోకి తెల్లటి పొడవైన వేళ్ళు పోనిచ్చి నిమురుతుంది.

''కాని డియర్. అప్పట్లో నేను నథింగ్। కరేజ్‌లెస్. నెర్వ్‌లెస్. నో మోర్ డియర్ జయా? నువు నాకు కావాలి చెప్పు. ఎప్పటికీ నన్ను విడిచి పోకుండా నాతోనే ఉంటావు గదూ!''

జయ రావు మీదికి వంగిరావును కిక్కిరి బిక్కిరి చేసింది.

* * *

తన చేతిలో పాలరాతి బొమ్మ. వీనస్. గులాబీ. అన్నీ కలిసిపోయి రూపు దాల్చిన సుందర రూపం। మనసులో మళ్ళీ ఆలోచనలు వర్షాకాలం మురికి కారుతున్న బెల్లం మీద గుంపుగా ముసిరిన, ఇంకా మురికి ఈగల్లాంటి ఆలోచనలు। ఇవి తనను వదలవు చచ్చేదాకా తన నల్లటి భార్య. బెలూనులాంటి భార్య వదలనిస్తే వదలవు గాక వదలవు

ఇప్పటికే జీవితంలో తాను చాలా కోల్పోయాడు. ఏదైతే ఆనందమనీ సుఖమనీ అనుకున్నాడో అదంతా సుఖాభాసమనీ మిథ్యనీ తేలిపోయింది.

ఇంతకాలం తానుత్త వెధవ బ్రతుకు బ్రతికాడు. ఇలాంటి పసిడి బొమ్మను వదిలి నరకంలో మగ్గిపోయాడు. డబ్బు కోసం, కారుకోసం బెలూనుకోసం కుక్కకోసం, నీచంగా బ్రతికాడు। డామిట్!!

జయను వదిలేయడం తాను చేసిన పొరపాటు. ఇంక తాను వదలడుగాక వదలడు ప్రపంచంలో ఏది లేకున్నా తనకు జయ కావాలి।

రావు ఆలోచిస్తూనే చేయి కదిలించాడు. సముద్రపు నురుగులాంటి,నీలిమేఘాల్లాంటి

తలవెంట్రుకలు, క్రింద అరమోడ్చిన కనులు, గ్రీకు శిల్పాల్లో కనిపించే ముక్కు తగిలాయి?

ఆలోచనలు ముసురుకుంటూనే ఉన్నాయి!

రావు ఒక నిశ్చయానికి వస్తూనే ఉన్నాడు ఆ నిశ్చయం వెనక దాగి ఉన్న ప్రతి బంధకాలను ఏ మాత్రం లెఖ్ఖ చేయ దలుచుకోలేదు!

జయ తనక్కావాలి! ఇంకేం లేకున్నా ఫర్వాలేదు. అయితే మరి. ఛత్. మళ్ళీ వెధవ ఆలోచనలు!

*　　　*　　　*

''జయా!''

''ఊఁ''

''ఎప్పటికీ నాతో ఇలాగే ఉండి పోతావా?''

''అమ్మో!''

''ఏం! ఒకపుడు నువు అడిగితే నేను కాదన్నాను. అందుకా ఇపుడు నేనడిగితే నువు కాదంటున్నావు''

''అది కాదు పరిస్థితులు!''

''ఐ డోంట్ కేర్! పరిస్థితులనులెక్క చేయనంత ధైర్యం నా కొచ్చేసింది.'' రావు మాటలు ముద్దగా వస్తున్నాయి!

''రావు ఇపుడు నీకు పెళ్ళయింది!''

''ఆ డాంబిచ్ గురించి గుర్తుచేయక! నువు నాక్కావాలి!''

''దానికి పెళ్ళి దాకా ఎందుకు? నువెపుడు కావాలంటే అపుడు నీ కోసం వస్తానుగా!''

''నో. నాకు నువు పూర్తిగా కావాలి. బాగా ఆలోచించుకో రేపటి దాకా గడువు! నీ కెంత డబ్బు కావాలో ఇపుడు తీసుకెళ్లు! బాకీలు, అప్పులు తీర్చేయ్. దట్సాల్!''

జయ రావు ఛాతీమీద తలాంచి వింటూ పడుకుంది సమయం గడిచి పోతుంది. జయ లేచింది!

''జయా డోంట్ బాదర్. ఆ పర్సులో డబ్బుంది. తీసుకో! నువు నాక్కావాలి ''డోంట్ కేర్!'' మంచం మీదనుండి గొణుగుతున్నాడు. జయ పర్సులోనుండి నోట్ల దొంతర తీసుకుంది తలుపు తెరుచుకుని నెమ్మదిగా బయటకు పోయింది.

*　　　*　　　*

''నేపోతున్నా!''

''అపుడే!'' రూంబాయి అడిగాడు

''అదంతేలే!!''

''ఎంతిచ్చాడేమిటి?''

''ఉత్త పిచ్చోడు. ఇదుగో! అయిదొందలు లాగాను! నన్నూరికే ''జయా'' ''జయా'' అని పిలుస్తున్నాడు మందులో మనుషుల ఆనవాలు సరిగా దొరక లేదేమో. ఎవర్తో ఆ జయగానీ మానవుణ్ణి భలే దెబ్బతీసింది. దాన్ని గురించే కలవరింతలు హహ్హహ్హా!'' పాల రాతి బొమ్మ ముక్కలు చెక్కలయినట్లు నవ్వింది. రూంబోయి కూడా నవ్వాడు. ఆమె రూంబాయికి కొంత డబ్బుయిచ్చింది

''బయట రిక్షా ఉంది. పోతావా?''

''ఛీ ఇవాళ టాక్సీ పిలువ్!''

''మళ్ళీ రేపొస్తావా?''

''ఈయన దగ్గరకా? ఏమో! ఇంకేదయినా మంచి బేరం ఉంటే వీలుపడదు! వస్తారా!''




ఆమె వెళ్ళిపోయింది—

*　　　*　　　*

రావుకి తెల్లవారు ఝామున మెలకువ వచ్చింది—

మెలుకువ తోపాటు ఆలోచనలు. తల పగిలిపోయే ఆలోచనలు. రావు ఆ ఆలోచనల్తో కంపించి పోయాడు! తానెంత ఇడియట్. రోగ్ కాకపోతే రాత్రి తాను వాగిందేమిటి? ఒక్కో విషయం గుర్తుకు వస్తుంటే అంత పొద్దున్నే రావుకు చెమట పట్టేయడం మొదలయింది.

ఇంకా నయం!

జయ తన మాటలన్నింటికీ ఒప్పుకుని తనతోనే ఉంటానంటే పెద్ద గొడవే అయిపోను! గొడవే అయితే—

భార్య, కార్లు మేడ, బొచ్చుకుక్కలు నౌకర్లు ఫాక్టరీలు, స్టేటస్ బెలూను ఇదంతా ఏమయిపోయేట్ట??

★


## 'శ్రీరామరక్ష-సర్వాజగద్రక్ష'

ఇహ పరసాధనకు మార్గదర్శి యైన ఈ దివ్యనామ ఫలకములను విశ్వవ్యాప్తముగా ఇంట ఇంట నలంకరించుకొని ప్రజాశ్రేయస్సుకు ప్రపంచశాంతికి తోడ్పడ ప్రార్థన.

ఇట్లు,
శ్రీరామరక్షా పున్నారావు,
గూడూరు (నెల్లూరుజిల్లా.)